జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 6 | మార్చి | 2026 ◆ పేజీలు : 8



# మణుగూరులో జిల్లా కలెక్టర్ అంకిత్ సుడిగాలి పర్యటన

- ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు
- విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట –
- నాణ్యమైన భోజనం అందించడం అందరి బాధ్యత
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 5 , ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం సుడిగాలి పర్యటన నిర్వహించి పలు ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల, గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలోని వార్డులు, ఔషధ నిల్వ గది, మందుల సరఫరా విధానం, ఔట్‌పేషంట్ విభాగం, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు

మిగతా 2 లో...




# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్

- అధికారులకు మంత్రి ధనసరి అనసూయ మార్గదర్శకాలు

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 5 ప్రజాజ్యోతి:** గరాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా , శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, ఈ సందర్భంగా రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ , పంచాయతీరాజ్ కమిషనర్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలు, మండలాలు , గ్రామ స్థాయిలో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై అధికారులకు సమగ్రంగా వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణలో వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత , ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్ కార్యక్రమాలు, మార్చి 16 నుండి మార్చి 31 వరకు ఆదాయం పెంపుదల కార్యక్రమాలు ట్యాక్స్ కలెక్షన్ నిర్వహించబడతాయని, అదేవిధంగా ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 15 వరకు తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు, ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు

మిగతా 2 లో...

# దంతెవాడలో ఎన్ కౌంటర్

- ఒక మావోయిస్టు మృతి
- మృతి చెందిన మావోయిస్టుపై ఐదు లక్షల రివార్డ్
- ఆయుధాలు పేలుడు పదార్థాలు స్వాధీనం




**చర్ల, మార్చ్ 05: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ–బీజాపూర్ సరిహద్దు ప్రాంతంలో గీడం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్లానార్, గిర్సాపారా నెల్గోడా గ్రామాల మధ్య ఉన్న అటవీ–పర్వత ప్రాంతంలో నక్సలైట్ సామగ్రి ఆయుధాలను పడవేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఆ సమాచారం మేరకు, పోలీసు సూపరింటెండెంట్ దంతేవాడ ఆదేశాల మేరకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ కుమార్ ఉయ్కే

మిగతా 2 లో...

# గిరిజన ప్రాంతాల్లో నవజాత శిశు మరణాలు తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- నీతి ఆయోగ్ కన్సల్టెంట్ ఉమాంగ్ కటోచ్




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , మార్చి 5,ప్రజాజ్యోతి :** మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు నవజాత శిశు మరణాలు జరగకుండా చూడటం సంబంధిత వైద్యాధికారుల బాధ్యత అని నీతి ఆయోగ్ కన్సల్టెంట్ ఉమాంగ్ కటోచ్ అన్నారు. గురువారం భద్రాచలం ఏరియా ఆసుపత్రిని జిల్లా అధికారులతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో మాతృ, శిశు సంరక్షణ సేవలు ఎలా అందుతున్నాయో పరిశీలించారు. ముఖ్యంగా ప్రసూతి వార్డు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్




(మొదటి పేజీ తరువాయి...)

గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు చేపడతారనీ, అనంతరం మే 1 నుండి మే 15 వరకు ఉపాధి హామీ పథకం పనుల అమలు, అలాగే మే 16 నుండి మే 31 వరకు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల అమలులో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం నుండి డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీఓ సుధీర్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దంతెవాడలో ఎన్ కౌంటర్

(మొదటి పేజీ తరువాయి...)

నాయకత్వంలో, డి ఆర్ జి బస్తర్ ఫైటర్స్ జవాన్ల దళాన్ని ప్రణాళికాబద్ధంగా పంపారు. ఈ సందర్భంగా పోలీసులకు నక్సలైట్లకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి కాల్పుల అనంతరం ఎన్‌కౌంటర్ స్థలంలో క్షుణ్ణంగా జరిపిన శోధనలో, ఒక సాయుధ మావోయిస్టు మృతదేహంతో పాటు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు స్వాధీనం చేసుకున్న సామాగ్రి ఒక ఎస్ ఎల్ ఆర్ , రైఫిల్ ఒక ఇన్సాస్ రైఫిల్ ,ఒక మ్యాగజైన్‌తో కూడిన పిస్టల్, ఒక వాకీ-టాకీ సెట్ ,ఒక ఎస్ ఎల్ ఆర్ మ్యాగజైన్ ,ఆరు ఎస్ ఎల్ ఆర్ లైవ్ రౌండ్లు, ఒక ఎస్ ఎల్ ఆర్ ఖాళీ షెల్, మూడు ఇన్సాస్ మ్యాగజైన్‌లు ,ఐదు ఇన్సాస్ లైవ్ రౌండ్లు, 18 ఇన్సాస్ మిస్‌ఫైర్ రౌండ్లు, మూడు ఇన్సాస్ ఖాళీ షెల్లు, 05 పిస్టల్ లైవ్ రౌండ్లు ,ఒక పిస్టల్ ఖాళీ షెల్ ఒక పౌచ్ ను స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన కేడర్ ద్వారా ఎన్‌కౌంటర్ సైట్ నుండి స్వాధీనం చేసుకున్న మావోయిస్టు వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన తరువాత, రాజేష్ పునేమ్, ఏ సి ఎం , భైరామ్‌గఢ్ ఏరియా కమిటీ, అని అతనిపై ప్రభుత్వం 5 లక్షల రివార్డు ఉన్నది అని బీజాపూ ర్ జిల్లా, గంగలూరు పోలీస్ స్టేషన్, బుర్జి గ్రామంగా మృతి చెందిన మావోయిస్టుని గుర్తించారు.సంఘటనా స్థలం నుంచి మావోయిస్టు మృతదే హం , ఆయుధాలు నక్సలైట్ సామగ్రిని స్వాధీనం చేసుకొని మొత్తం దళం సు రక్షితంగా జిల్లా ప్రధాన కార్యాలయం దంతెవాడకు చేరుకుంది. ఎటువంటి ప్రా ణనష్టం లేకుండా ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది అని అధికారులు అన్నారు .

## పరీక్షల్లో విద్యార్థులు వత్తిడికి గురికావద్దు

- **జిల్లా విద్యాశాఖాధికారిణి నాగలక్ష్మి**

**బూర్గంపహాడ్, మార్చి 5 (ప్రజా జ్యోతి ):** త్వరలో జరగనున్న పదవతరగతి పరీక్షల్లో విద్యార్థులు వత్తిడికి గురికావద్దని జిల్లా విద్యాశాఖాధికారిణి నాగలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదిలో పదవతరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదవతరగతి పరీక్షలు విద్యార్థి తలరాతను మార్చుతాయని, విద్యార్థులు ఇప్పటివరకు చదివిన పాఠ్యాంశాలు మననం చేసుకుని పరీక్షల సమయంలో వత్తిడికి గురికాకుండా ఎంతో ప్రశాంతతతో వ్యవహరించాలని, పరీక్షలు రాసేటప్పుడు భయం లేకుండా మానసిక వత్తిడి పడకుండా చూసుకోవాలన్నారు. పది పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి గ్రామానికి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షిస్తూ పది విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. పాఠశాల పరిసరాలు ఆహ్లాదకరంగా ఉన్నాయని ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మణుగూరులో జిల్లా కలెక్టర్ అంకిత్ సుడిగాలి పర్యటన





(మొదటి పేజీ తరువాయి...)

వచ్చే రోగుల పట్ల సేవాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, బోధన విధానం గురించి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్‌లో ఆహార తయారీ విధానాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారు పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఫలితాల వివరాలు తెలుసుకొని ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో పాటు పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, వారికి నాణ్యమైన ఆహారం అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరి యూనిట్ ద్వారా సరఫరా అవుతున్న చిక్కీలను స్వయంగా రుచి చూసి వాటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని కూడా రుచి చూసి ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి తరగతి గదులు, విద్యార్థుల హాజరు, బోధన విధానం ,అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి వారికి పాఠాలు ఎలా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మంచి విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం మరియు ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, పోషకాహారం పంపిణీ విధానం, పిల్లల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని వంటగది, స్టోర్ రూమ్, త్రాగునీటి సదుపాయం, పరిశుభ్రత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి గుడ్ల పరిమాణాన్ని పరిశీలించారు. పిల్లలకు అందించే పోషకాహారం మెనూ ప్రకారం సమయానికి అందుతున్నదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆటపాటల ద్వారా బోధన విధానాన్ని కూడా పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం నాణ్యంగా, పరిశుభ్రంగా అందేలా, కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, వైద్యులు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఉపాధ్యాయులు విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో నవజాత శిశు మరణాలు తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి





(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం, పోషకాహార పునరుద్ధరణ కేంద్రం వంటి విభాగాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు.ప్రసవ గదిలో సాధారణ ప్రసవాలు ఎలా నిర్వహిస్తున్నారో, వాటికి అనుసరించే విధానాలు ఏమిటో వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రసవం అనంతరం శిశువులకు బరువు కొలవడం, అందుకు అవసరమైన పరికరాలు ఉన్నాయా లేదా అనే అంశాలను నిశితంగా పరిశీలించారు. సంబంధిత రిజిస్టర్లను కూడా పరిశీలించారు.అలాగే ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో చికిత్స పొందుతున్న శిశువుల



పరిస్థితిని పరిశీలించి వారికి అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. నవజాత శిశు మరణాల శాతంపై ప్రత్యేకంగా విచారణ జరిపారు. భద్రాచలం ఆసుపత్రిలో ఈ మరణాల శాతం తక్కువగా ఉండటాన్ని గమనించి దానికి కారణాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మరణాల శాతం తగ్గించేందుకు ఆసుపత్రి తీసుకుంటున్న చర్యలు, చికిత్స విధానాలపై కూడా చర్చించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, నిర్వహణ విధానం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్య సిబ్బందిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాలో, ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో నవజాత శిశు మరణాలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు, సదుపాయాలపై ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ అధికారి సంజీవరావు, నీతి ఆయోగ్ సహాయక కన్సల్టెంట్ నవనీత్, ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ రాజశేఖర్, పర్యవేక్షకుడు రామకృష్ణతో పాటు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన : కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి5: ప్రజా జ్యోతి**
ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్నగదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు పై సంతకం చేశారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య, ఎన్నికల సూపరింటెంట్ రంగ ప్రసాద్, డి ఎల్ ఎం టి సాయికృష్ణ, పొలిటికల్ పార్టీ నోముల రమేష్ బిజెపి, కాంగ్రెస్ పార్టీ, జయ శ్రీలక్ష్మి, హమ్ ఆఫ్ ది పార్టీ రాంబాబు, సిపిఎం పార్టీ ఎల్ బాల రాజు, ఏ సత్యనారాయణ ఎన్నికల సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

## శిక్షణ పూర్తి చేసుకున్న వారు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 5 (ప్రజాజ్యోతి ):**నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు జీవితంలో స్థిరపడేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో యువతకు నిర్వహించిన 60 రోజుల ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మత్తు శిక్షణను పూర్తి చేసుకున్న గిరిజన యువతీ యువకులకు ఆయన శిక్షణ ధ్రువపత్రాలను అందజేశారు.గురువారం ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన శిక్షణ పొందిన యువతకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చదువులు పూర్తయ్యాక ఖాళీగా ఉండకుండా ఇటువంటి వృత్తి ఆధారిత శిక్షణలు పొందడం ద్వారా యువత తమకు తాము ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలని సూచించారు.ప్రస్తుతం అనేక సంస్థల్లో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పనులు జరుగుతున్న నేపథ్యంలో యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. శిక్షణ పొందిన యువత కష్టపడి పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తే అనుభవం కూడా పెరుగుతుందని అన్నారు.ఇటువంటి శిక్షణలను ఆదర్శంగా తీసుకొని మరిన్ని నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు శిక్షణలు పొంది ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో గిరిజన యువత స్వయం ఉపాధి కోసం చిన్నతరహా పరిశ్రమలు స్థాపించాలనుకుంటే ఐటీడీఏ ద్వారా అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, శిక్షకురాలు భవాని, ప్రాజెక్టు సమన్వయకర్త మహేష్, వార్డెన్ దీనా కుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే శిక్షణ పొందిన గిరిజన యువతీ యువకులు హాజరయ్యారు.

## బిటిపిఎస్ సిఎస్ఆర్ నిధులు నిర్వాసిత గ్రామాల అభివృద్ధికే ఉపయోగించాలి

- నిర్వాసిత గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్ కు వినతిపత్రం అందజేత
- సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి



**మణుగూరు, మార్చి 05, (ప్రజాజ్యోతి) :** బిటిపిఎస్ సిఎస్ఆర్ నిధులు నిర్వాసిత గ్రామాల అభివృద్ధికే ఉపయోగించాలని, నిర్వాసిత గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యా, వైద్యం, విద్యుత్తు, త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ మణుగూరు పర్యటన సందర్భంగా ఆయనను కలిసి బిటీపిఎస్ నిర్వాసితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... బిటిపిఎస్ నిర్మాణం కోసం నిర్వాసిత గ్రామాల ప్రజలు భూములిచ్చి దాని నుండి వెలువడే కాలుష్యాన్ని భరిస్తూ రోగాల బారిన పడుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి నిర్వాసిత గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగించవలసిన బిటిపిఎస్ సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించకుండా బయటి ప్రాంతాలకు తరలించడమేంటని ప్రశ్నించారు. దీని వలన నిర్వాసిత గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ము, ప్రభుత్వ అధికారులు నిర్వాసిత గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి బిటిపిఎస్ సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. నిర్వాసిత గ్రామాల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే పార్టీ ఆధ్వర్యంలో కలిసి వచ్చే అన్ని వర్గాల వారినందరిని కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

## వాతావరణ మార్పులు, సుస్థిర వ్యవసాయంపై అవగాహన



**బూర్గంపహాడ్, మార్చి 5 (ప్రజా జ్యోతి ):**వాతావరణ మార్పులతో పాటు సుస్థిర వ్యవసాయంపై సీఎస్ఐఆర్–ఐఐసీటీ(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్–ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) విద్యార్థి బృందం గురువారం మండల పరిధిలోని పినపాక పట్టీనగర్, ఉప్పుసాక గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించింది. వాతావరణంలో వచ్చే మార్పులు, ప్రజల ఆరోగ్యంపై దాని ప్రభావం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను బృందంలోని పీహెచ్ఎ విద్యార్థి సంపత్ రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ జరగాలంటే ప్లాసిక్ ను అంతమొందించాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రజలు పాటుపడాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అనంతరం అవగాహన కార్యక్రమానికి వచ్చిన రైతులు, గ్రామస్థులకు గుడ్డసంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ పద్మ, బానోత్ వెంకట్తో పాటు బృందంలోని పీహెచ్ఎ విద్యార్థులు దీప్తి, సంపత్, శ్రీలేఖ, ప్రవీణ్, గ్రామస్థులు దరావత్ శ్రీను, దోమల వీరబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చంటి బిడ్డతోనే విధి నిర్వహణ

- మాతృత్వానికి అడ్డు కాని సేవా భావం
- పాల్వంచ మండలం బసవతారక కాలనీలో ఆధార్ ఆపరేటర్ భూక్యా వెన్నెలకు ప్రజల ప్రశంసలు



**పాల్వంచ, మార్చి 5, ప్రజాజ్యోతి:**పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఆధార్ సేవా కేంద్రంలో పనిచేస్తున్న ఆధార్ ఆపరేటర్ శ్రీమతి భూక్యా వెన్నెల తన సేవా తత్వంతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఏడాది వయస్సు ఉన్న చంటి బిడ్డను ఒడిలో పెట్టుకొని కూడా విధి నిర్వహణ చేస్తూ ప్రజలకు ఆధార్ సేవలను అందించడం అక్కడికి వచ్చిన వారిని ఆకట్టుకుంటోంది.వెన్నెలకు ప్రస్తుతం ఏడాది వయస్సు ఉన్న చిన్నారి ఉండడంతో విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు ఆపరేటర్ యాక్టివేషన్ కోసం పై అధికారులకు దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో, అప్పటివరకు ప్రజలకు సేవలు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఆమె చంటి బిడ్డతోనే ఆధార్ కేంద్రానికి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు.ఆధార్ సేవల కోసం కేంద్రానికి వచ్చిన ప్రజలు ఈ దృశ్యాన్ని చూసి భూక్యా వెన్నెల సేవా భావాన్ని అభినందిస్తున్నారు. తల్లితనం బాధ్యతలు ఉన్నప్పటికీ ప్రజా సేవను ముందుకు పెట్టి కష్టపడి పనిచేస్తున్న ఆమెను పలువురు ప్రశంసిస్తూ "మాతృత్వానికి విధి నిర్వహణ అడ్డు కాదు" అని పేర్కొంటున్నారు.బసవతారక కాలనీ గ్రామపంచాయతీ ఆధార్ సేవా కేంద్రంలో కనిపించిన ఈ సన్నివేశం సేవా భావం, బాధ్యత, తల్లితనం కలిసిన ఒక ప్రేరణాత్మక ఉదాహరణగా నిలుస్తోంది.

## గిరి మాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



**భద్రాచలం, మార్చి 5,ప్రజాజ్యోతి :**భద్రాచలం పట్టణంలో నిర్మాణం చేపడుతున్న గిరి మాల్ను ప్రజలను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని, అందుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత ఇంజనీర్లకు ఆదేశించారు.గురువారం భద్రాచలం పట్టణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న గిరి మాల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. ఈ నెల 10వ తేదీ నాటికి గిరి మాల్ నిర్మాణానికి సంబంధించిన సివిల్ పనులను పూర్తిచేయాలని సూచించారు. శ్రీరామనవమి పండుగకు ముందుగానే గిరి మాల్ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నందున పనులు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు.గిరి మాల్ ముందు భాగం ప్రజలను ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన రూపకల్పనతో నిర్మించాలని సూచించారు. గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆదివాసి గిరిజన కుటుంబాలతో పాటు పట్టణ ప్రజలకు కల్తీ లేని నాణ్యమైన నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచే లక్ష్యంతో ఈ గిరి మాల్ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అందువల్ల నిర్మాణ పనులు నాసిరకంగా కాకుండా నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తిచేయాలని ఇంజనీర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ మధుకర్ పాల్గొన్నారు

## పునః ప్రారంభమైన నిత్యకల్యాణాలు



**భద్రాచలం, మార్చి 5,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గురువారం నుంచి నిత్యకల్యాణాలు పునః ప్రారంభమయ్యాయి. స్వామి వారిని అందంగా అలంకరించి నిత్యకల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, తలంబ్రాలు, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక బృందం నిర్వహించారు.

## కార్మిక కుటుంబాలకు సిఐటియు అండగా ఉంటుంది

- సిఐటియు జిల్లా నాయకులు ఎర్రం శెట్టి వెంకట రామారావు
- పలువురు కార్మికులను పరామర్శించిన సిఐటియు బృందం



**భద్రాచలం, మార్చి 5,ప్రజాజ్యోతి :** నిరంతరం కార్మిక సమస్యలపై పోరాటాలు నిర్వహించడంతోపాటు కార్మిక కుటుంబాలకు ఏ సమస్య వచ్చిన సిఐటియు అండగా ఉంటుందని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు ఎర్రం శెట్టి వెంకట రామారావు అన్నారు. గురువారం వెంకటేశ్వర కార్పెంటర్స్ యూనియన్ కార్యదర్శి అప్పారి రాము సతీమణి ఆరోగ్యంతో స్థానిక రమేష్ చంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను సిఐటియు పట్టణ కమిటీ బృందం పరామర్శించారు. అనంతరం అంగన్‌వాడి యూనియన్ నాయకురాలు మిడియం సావిత్రి కాలు గాయంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆమెను సైతం సిఐటియు బృందం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట రామారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు కార్పెంటర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై అప్పారి రాము నిరంతరాయంగా పోరాటాలు నిర్వహిస్తుంటారని, అటువంటి రాము కుటుంబంలో అనారోగ్య సమస్యలు రావడం ఉద్యమానికి కొంతమేర ఇబ్బంది కలిగిన త్వరగా సమస్యల నుండి అప్పారి రాము మనోధర్యంతో బయటపడాలని కోరారు. అదేవిధంగా అంగనవాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు మీడియం సావిత్రి కాలుకి తీవ్ర గాయమైనప్పటికీ విధులకు హాజరవుతూ చిత్తశుద్ధితో చిన్నారులకు సేవలందిస్తున్నారని మీడియం సావిత్రి కాలు గాయాన్ని సైతం లెక్కచేయకుండా విధులకు హాజరవుతున్న సావిత్రి ఆదర్శనీయమని అన్నారు. సావిత్రి వీలైనంత త్వరగా కోలుకొని మరల కార్మిక ఉద్యమాలలోకి చురుకుగా పాల్గొనాలని వెంకటరామారావు ఆశాభావం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా నాయకులు కొలగాని రమేష్ సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ నకిరేకంటి నాగరాజు పారేల్లి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునికి మెమో జారీ



**ఇల్లందు, మార్చి 5, ప్రజాజ్యోతి:** మండలంలోని సంజయ్ నగర్ మండల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు యం దుర్గయ్య పాఠశాల విధులను విస్మరించి, పాఠశాల వదిలి బయట తిరుగుతూ ఉండటంతో గురువారం మండల విద్యాధికారి ఉమా శంకర్ మెమో జారీ చేశారు. ఈ రోజు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులను విచారించిన యంఈఓ పాఠశాల ఉపాధ్యాయుడు దుర్గయ్య పాఠశాల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తరచుగా గైర్హాజరు అవుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈనెల 4న ఉదయం పాఠశాల సమయంలో సంతకం చేసిన దుర్గయ్య తర్వాత మధ్యా హ్నం నుంచి కనపడకుండా పోయారని, ఈనెల 4వ తేది మధ్యాహ్నం సంతకం ఈనెల 5న ఎందుకు చేసారో తెలియజేయాలని మెమో జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుని పనితీరుపై సమగ్ర విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

# సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డి ఎం అండ్ హెచ్ వోతుకారం రాథోడ్





**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 5, ప్రజా జ్యోతి**

కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్ లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తుకారం రాథోడ్ గురు వారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మిషన్ హెల్త్–100 ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు.అదేవిధంగా స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ గదులు, ప్రయోగశాల సేవలు, ఔషధ పంపిణీ కేంద్రం (ఫార్మసీ), రిజిస్ట్రేషన్ ,హెల్ప్‌డెస్క్ కౌంటర్లు, రోగుల కోసం వేచిచూసే ప్రదేశాలు, త్రాగునీరు , పారిశుద్ధ్య సదుపాయాలు, ఐఈసీ ప్రచార బోర్డులు, దిశా సూచికలు , బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానం, రోగుల రాకపోకల సమన్వయం వంటి అన్ని అంశాలను సమగ్రంగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూశిబిరానికి హాజరయ్యే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సక్రమ ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, స్పెషలిస్ట్ వైద్యులతో సమన్వయం పాటించాలని, అవసరమైన ఔషధాలు , ల్యాబ్ పరీక్షలు అందుబాటులో ఉంచాలని, ప్రతి విభాగం సమయపాలనతో పని చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.అనంతరం నిర్వహించిన ఆశా దినోత్సవ సమావేశంలో డి ఎం హెచ్ ఓ పాల్గొని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం ఎస్ లను, ఇతర సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. మిషన్ హెల్త్–100 కార్యక్రమం ప్రధాన లక్ష్యాలను వివరించి, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలను సమగ్ర ఆరోగ్య ప్రొఫైల్ స్క్రీనింగ్‌కు సమీకరించడం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, వృద్ధులు , ఇతర అవసరమైన లబ్ధిదారులు శిబిరానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా ప్రతి వైద్య కేంద్రంలో ఫ్యామిలీ ప్లానింగ్ కార్నర్‌ను బలోపేతం చేసి, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, అన్ని ఆరోగ్య సూచికలను మెరుగుపరచే దిశగా కృషి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేసి, మిషన్ హెల్త్–100 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు, అనంతరంజూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా సందర్శించి శుక్రవారం నిర్వహించనున్న మిషన్ హెల్త్–100ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాట్లను సమీక్షించారు. ఈ శిబిరంలో ఆరు విభాగాల నిపుణ వైద్యులు సేవలు అందించనున్నారని, సాధారణ వైద్య నిపుణుడుకంటి వైద్య నిపుణుడు, ఎముకల వైద్య నిపుణుడు, స్త్రీరోగ నిపుణుడుశిశు వైద్య నిపుణుడు, దంత వైద్య నిపుణుడు, తమ పరిధిలోని అన్ని గ్రామాలలో మైకింగ్ ప్రకటనలు నిర్వహించి, అవసరమైన లబ్ధిదారులను శిబిరానికి సమీకరించాలని వైద్య అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా శిబిరానికి హాజరు అయ్యేలా ప్రచారం చేయాలని సూచించారు.మిషన్ హెల్త్–100 కార్యక్రమం మిగిలిన 99 రోజుల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆరోగ్య ప్రొఫైల్ స్క్రీనింగ్‌ను వేగవంతం చేసి, జిల్లా వ్యాప్తంగా సమగ్ర ఆరోగ్య సేవలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా పాల్వంచ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం నందు సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని భోగ్ బండారు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన బంజారా ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం, మార్చి 5 ప్రజాజ్యోతి :** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులలో దాగి ఉన్న మేధాశక్తిని, నైపుణ్యాలను వెలికి తీసి వారి భవిష్యత్తును ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రతిభ ప్రోత్సాహక పరీక్షల నిర్వహణ ప్రతిభావంతులను గుర్తించడానికి కృషి చేస్తున్నామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం నాడు భద్రాచలంలోని ఏ జి హెచ్ ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న ప్రతి భ ప్రోత్సాహక పరీక్షల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. బాల బాలికలు పరీక్ష లు రాస్తున్న తీరును ఆయన పరిశీలించిన అనంతరం పిల్లలకు సూచనలు ఇస్తూ ఎటువంటి భయాందోళనలు మనసులో పెట్టుకోకుండా మీలో దాగి ఉన్న నైపుణ్యాలను ప్రతిభను వెలికి తీసి నిర్భయంగా పరీక్షలు రాసి అత్యుత్తమ ర్యాంకులు తెచ్చుకోవాలని అన్నారు. ఈ పరీక్షలు పదో తరగతి తర్వాత మీరు రాసే కాంపిటేటివ్ పరీక్షలు, జేఈఈ, నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలు రాయడానికి ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. ఈ ప్రతిభా ప్రోత్సాహక పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థినిలకు ఉపాధ్యాయులు కానీ ఇంజ్యులేటర్స్ గాని ఎవరు సహాయ సహకారాలు అందించవద్దని ఆదేశించారు. పిల్లలు వారి ప్రతిభ ద్వారానే సొంతంగా పరీక్షలు రాసేలా చూడాలని, గ్రూప్స్ పరీక్షలు ఏ విధంగా పగడ్బందీగా నిర్వహిస్తారో ఆ విధంగా చాలా జాగ్రత్తగా నిర్వహించేటట్లు చూడాలని పరీక్షా కేంద్రం ఫ్లయింగ్ స్క్వాడ్ ఏ సి యం ఓ రమేష్‌కు ఆదేశించారు. అనంతరం పరీక్ష హాల్లో విద్యార్థినీ విద్యార్థులకు కల్పించిన వసతి సౌకర్యాల గురించి హెచ్ ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్స్ స్క్వాడ్లుగా ఎస్ సి ఆర్ పి లు విటల్ బాబు, లక్ష్మీనారాయణ, శంకర్, మున్నా, హరిలాల్, రమేష్, పాఠశాల హెచ్ ఎంలు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పినపాకలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై సమావేశం

**పినపాక,మార్చి 05(ప్రజాజ్యోతి):** పినపాక మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్పెషల్ అధికారి తాతారావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ సంకీర్త్, ఎంపీవో వెంకటేశ్వరరావు 99 రోజుల యాక్షన్ ప్లాన్ వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ఐదు దశల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాన్ని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచు లు ఎన్నికైన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో కార్యక్రమం అమలు విధానం, గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, ప్రజలకు అందించాల్సిన సేవలపై అధికారులకు వివరించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ గోపాల కృష్ణ, పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ దుర్గ భవాని, ఏఈ వేణుగోపాల్, సూపర్డెంట్ శ్రీనివాసరావు, ఏపీవో వీరభద్ర స్వామి, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఇటుక బట్టీల ఆగడాలు .. 1/70 చట్టాన్ని పట్టని అధికారులు

- బట్టీల్లో మగ్గుతున్న బాల్యం
- కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు

**అశ్వాపురం, మార్చి 5 (ప్రజాజ్యోతి ):** ఏజెన్సీ ప్రాంతాల్లో అమల్లో ఉన్న 1/70 చట్టాన్ని పట్టించుకోకుండా కొందరు బడాబాబులు అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అశ్వాపురం మండల పరిధిలోని సీతారాంపురం, బిజీ కొత్తూరు, సర్వపాడు, బంజర, గొండిగూడెం తదితర ఏజెన్సీ గ్రామాల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి ఇష్టారాజ్యంగా వ్యాపారం సాగిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం గుర్తించబడిన ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన భూములను గిరిజనేతరులకు లీజుకు ఇవ్వడం 1/70 చట్టం ప్రకారం నేరం. అయినప్పటికీ కొందరు ప్రభావశీలులు ఈ చట్టాన్ని తుంగలో తొక్కుతూ ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటుక బట్టీల కోసం వ్యవసాయ భూముల్లో మట్టిని భారీగా తవ్వడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. బట్టీల నుంచి వెలువడే పొగ, ధూళి కారణంగా పరిసర ప్రాంతాల్లో కాలుష్యం పెరిగి ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని వారు పేర్కొంటున్నారు. అడవులకు సమీపంలో బట్టీలు ఏర్పాటు చేయడంతో అడవులు కూడా నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటుకల తయారీ కోసం భూమిలో నుంచి మట్టి తవ్వాలంటే భూగర్భ శాఖ, పంచాయతీ శాఖల అనుమతులు





తప్పనిసరిగా ఉండాలి. అలాగే కాలుష్య నియంత్రణ మండలి అనుమతి కూడా అవసరం. కానీ మండలంలోని పలు ఇటుక బట్టీలు ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటుకల విక్రయాలపై ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు కూడా సరిగా చెల్లించడం లేదని, దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని పేర్కొంటున్నారు.

### ››› బట్టీల్లో మగ్గుతున్న బాల్యం

ఇటుక బట్టీల్లో బాల కార్మికులను వినియోగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలు పాఠశాలలో ఉండాల్సి ఉన్నప్పటికీ, కార్మికుల పిల్లలు ఇటుక బట్టీల్లోనే పనిచేస్తూ బాల్యాన్ని కోల్పోతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై విద్యా శాఖ, కార్మిక శాఖలు సరైన చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు పన్నులు చెల్లించి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నప్పటికీ ఇలాంటి సమస్యలపై అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ముఖ్యంగా కలెక్టర్ స్పందించి ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బాల కార్మిక వ్యవస్థను అరికట్టి పర్యావరణాన్ని కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వైభవంగా ముగిసిన బాలాజీ బ్రహ్మోత్సవాలు

- మహా పూర్ణాహుతి, చక్రస్థానము, పుష్పయాగం నిర్వహణ



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 5,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ముగిశాయి. చివరి రోజు ఉదయం మహా పూర్ణాహుతి, చక్రస్థానము, మహా కుంభ ప్రోక్షణ కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరిసర గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. సాయంత్రం 6 గంటలకు శ్రీ పుష్పయాగము, దేవత ద్వాసన, ధ్వజ అవరోహణము, శృంగార డోలోత్సవం, నివేదన, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు, ఆచార్యులు, రిత్వికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించి బ్రహ్మోత్సవాలను సంప్రదాయబద్ధంగా పరిసమాప్తం చేశారు. అదేవిధంగా సాయంత్రం 7 గంటల నుండి రాత్రి 10:30 గంటల వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను ఆస్వాదించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన పోలీసు శాఖ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు మరియు ఇతర విభాగాల అధికారులకు ఆలయ ఈవో పాకాల వెంకట రమణ ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు పరిస్థితి విషమం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు







**చంద్రుగొండ, ప్రజా జ్యోతి, మార్చి 05.** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గురువారం రాత్రి 7 గంటల సమయంలో హిందుస్థాన్ పెట్రోల్ బంకు సమీపంలో విజయవాడ జగదల్పూర్ జాతీయ రహదారిపై రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి.. రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో డ్రైవర్లు ఇద్దరూ క్యాబిన్ల లో ఇరుక్కుపోయారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో ఇరు డ్రైవర్లను అతి కష్టం మీద బయటకు తీసి 108 ద్వారా కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ప్రమాదం సంభవించడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఒక లారీ తమిళనాడుకు చెందినది కాగా మరోలారి చతిస్గడ్ రాష్ట్రానికి చెందినది.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రామ్మూర్తి అనే డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది.

## పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలి :: నిమ్మల రాంబాబు



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చ్ 5 ,ప్రజా జ్యోతి** పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులు తక్షణమే నిలిపివేయాలని సిపిఐ పార్టీ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు, పాల్వంచ మండలం పరిధిలోని రాళ్లచెలక గ్రామంలో పోడు భూముల సమస్యపై మండల నాయకులు వేములపల్లి శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నిమ్మల రాంబాబు మాట్లాడుతూ గత 20-30 సంవత్సరాలుగా పోడుగోట్టి భూములు సాగు చేసుకుని కుటుంబాలు పోషించుకుంటూ జీవిస్తున్న ఆదివాసి , ఇతర పేద రైతులపై ఫారెస్ట్ అధికారులు బెదిరింపులు, దాడులు చేయడం, ఇదేమిటి అని ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం వలన పోడు సాగు దారులు బువ్వ పెట్టే భూమి కోల్పోయి ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొంటున్నాయి అన్నారు, 2023లో కేసీఆర్ ప్రభుత్వం సాగులో ఉన్న పోడు భూములను సర్వే చేయించి పట్టాలు ఇవ్వకుండా గిరిజనేతర పేద రైతులను మోసం చేసిందని. గిరిజన రైతులకు కూడా సాగులో ఉన్న మొత్తం ఇవ్వకుండా అరకొరగా పట్టా లు ఇచ్చి వారిని కూడా మోసం చేసిందని. కేసీఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని తాము అధికారంలోకి వస్తే రైతులకు మేలు చేస్తామని హామీలు ఇచ్చి 2024లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటివరకు సాగులో ఉన్న పేద రైతులకు పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ రైతులను మోసం చేస్తున్నదని అన్నారు. హక్కులు లేకపోవడం వల్ల మాటిమాటికి ఫారెస్ట్ అధికారులతో పోడు సాగుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గిరిజన, గిరిజనేతర పేదలు సాగు చేసుకుంటున్న భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని. పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులు, దౌర్జన్యాలు ఆపాలని.ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులకు శాస్త్రీయ సోషలిజం నెల వారి మాసపత్రికలు అందించి, రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో నాయకులు మడకం లక్ష్మయ్య, గంగ, దేవయ్య, భీమా, రాజు,నందా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర

- ఉపాధి అవకాశాలు పెంచే దిశగా మరింత చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్‌ను కలిసిన కొత్తగూడెం ఏరియా జీఎం



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 5 – ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ని మర్యాద పూర్వకంగా వారి కార్యాలయంలో కలవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించాలని, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా మరింత చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ... సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో ఉన్న అండర్ గ్రౌండ్, ఉపరితల గనుల బొగ్గు ఉత్పత్తి ఉత్పాదికతలా వివరాలను, గనుల కార్యకలాపాలు, ఉద్యోగుల సంక్షేమం, స్థానిక అభివృద్ధి కార్యక్రమాల గురించి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి సింగరేణి సంస్థ చేస్తున్న సేవలను జీఎం వివరించారు. గనుల ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, రోడ్లు, విద్య, వైద్య సేవలు వంటి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం ఏరియా లోని వీకే సిఎం ప్రాజెక్టు పనులలో కలెక్టర్ సహాయ సహకారాలను కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ మధుమిత, ఇతర సంబధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికపై సన్నాహక సమావేశం

- పారిశుధ్య కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై అధికారులకు దిశానిర్దేశం
- ఎస్సీ బాలుర నివాస పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేసిన మండల ప్రత్యేక అధికారి





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 5,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రణాళిక) కార్యక్రమంపై బుధవారం అన్నపురెడ్డిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. మండల ప్రత్యేక అధికారి పరందామారెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరయ్యారు.ఈ సమావేశానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి రవీందర్ పాల్గొని కార్యక్రమం అమలుపై సూచనలు చేశారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పారిశుధ్య కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.మార్చి 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి దస్త్రాలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని తెలిపారు.ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి సమస్యలను గుర్తించాలని సూచించారు. గుర్తించిన సమస్యలను ప్రణాళికాబద్ధంగా దశలవారీగా పరిష్కరించాలని తెలిపారు. ఇందుకు అవసరమైన కార్మికులు, సామగ్రి ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.గ్రామాల్లో రహదారులు, కాలువలను శుభ్రం చేసి మురుగు నీరు సక్రమంగా పారేలా చూడాలని చెప్పారు. బ్లీచింగ్ పొడి చల్లి పరిశుభ్రతను కాపాడాలని తెలిపారు. కాలువల చివర సోక్ పిట్లు తవ్వించాలని సూచించారు.ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను శుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. బస్ నిలయాలను కూడా పరిశుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లోని నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని సూచించారు. నర్సరీలలో అన్ని సంచుల్లో విత్తనాలు నాటి షేడ్ నెట్ ఏర్పాటు చేయాలని తెలిపారు.కంపోస్ట్ షెడ్లను సక్రమంగా నిర్వహించడంతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సరైన విధంగా పారవేయాలని సూచించారు. గ్రామాల్లోని పార్కులను శుభ్రంగా ఉంచాలని తెలిపారు.చికెన్ వ్యాపారులు మరియు అధికంగా చెత్త ఉత్పత్తి చేసే వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి చెత్తను సరైన విధంగా పారవేయడం పై అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహిస్తూ చెరువులు, కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మల్టీ పర్పస్ కార్మికులకు సన్మానం చేసి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వారికి అవసరమైన రక్షణ సామగ్రిని అందించాలని సూచించారు.పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే ముందు మరియు తరువాత ఫొటోలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి అధికారులు సందర్శించినప్పుడు ఈ వివరాలు చూపించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.ఈ సమావేశంలో రోడ్లు మరియు భవనాల శాఖకు చెందిన అధికారులు కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు, పాత్రికేయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.అదే విధంగా మండల ప్రత్యేక అధికారి ఎస్సీ బాలుర నివాస పాఠశాలను సందర్శించి విద్యార్థుల తో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీవో సబ్నా, మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకులాల్లో పవిత్ర రంజాన్ ఉపవాసాలు నిర్వహణ

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 5 ,ప్రజా జ్యోతి**

కొత్తగూడెం జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థలు పవిత్ర రంజాన్ మాసాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. విద్యార్థులు ఇంటి వద్ద రంజాన్ ను జరుపుకున్న అనుభూతి కలిగేలా ప్రతీ గురుకులంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడం పలువురుని ఆకర్షింప చేస్తుంది, ప్రతీ రోజు వేకువ జామునే విద్యార్థుల ఉపవాసానికి అనుగుణంగా సేహరీ భోజనాన్ని సకాలంలో సిద్ధం చేసి అందిస్తున్నారు. అదేవిధంగా సాయంత్రం ఇఫ్తార్ సమయానికి రకరకాల తాజా పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, నిమ్మరసం , ప్రత్యేక వంటకాలతో సమృద్ధిగా విందు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, ఆధ్యాత్మికత రెండింటినీ దృష్టిలో ఉంచుకొని ఈ ఏర్పాట్లు చేయడం ద్వారా గురుకులాలు తమ బాధ్యతను నిర్వహిస్తున్నారు, అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని




వివిధ మైనారిటీ గురుకులాల్లో కలిపి మొత్తం 2391 మంది విద్యార్థులు రంజాన్ ఉపవాసాలను ఆచరిస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయడం సంస్థ నిబద్ధతకు నిదర్శనమని చెప్పవచ్చు,.ప్రత్యేకంగా, మైనారిటీ సంస్థ సెక్రటరీ బి. షఫీయుల్లా విద్యార్థుల కోసం అదనపు ఫండింగ్ అందించడం ద్వారా ఈ కార్యక్రమాలకు మరింత గా ప్రోత్సహిస్తున్నారు, ఆయన చూపిస్తున్న ప్రోత్సాహం, అంకితభావం అన్ని వర్గాల నుండి ప్రశంసలు అందుకుంటున్నారు, అదేవిధంగా మౌల్సాహెబ్ , అరబ్బీ ట్యూటర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నారు. నియమ నిష్ఠలతో ఉపవాసాలు పాటించేలా, రంజాన్ మహిమను అవగాహన చేసుకునేలా గురుకుల ప్రిన్సిపాళ్లు,వార్డెన్లు,సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మైనారిటీ గురుకులాల ఈ సమగ్ర ఏర్పాట్లు మైనారిటీ సంక్షేమానికి సంస్థ చూపిస్తున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మైనారిటీ సొసైటీ సెక్రటరీ , సంబంధిత గురుకులాల ప్రిన్సిపాళ్ల కృషి విద్యార్థుల భవిష్యత్తును ఆధ్యాత్మికంగా, బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతున్నారు

# ఉత్తమ అర్చకుల అవార్డు అందుకున్న ప్రతాపురం ప్రసాదాచార్యులు

- బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రశంసా పత్రం స్వీకారం
- తరతరాలుగా ఆలయ సేవలో కొనసాగుతున్న అర్చక కుటుంబానికి గౌరవం







**అన్నపురెడ్డిపల్లి, మార్చి 5,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న ప్రతాపురం ప్రసాదాచార్యులు ఉత్తమ అర్చకుల అవార్డును అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న కలెక్టర్ చేతుల మీదుగా అందించాల్సిన ఈ అవార్డును కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయన స్వీకరించలేకపోయారు.దీనితో బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఈవో పాకాల వెంకటరమణ చేతుల మీదుగా స్వామివారి సన్నిధిలో ప్రసాదాచార్యులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, భక్తులు ఆయనను అభినందించారు.ప్రతాపురం ప్రసాదాచార్యులు అర్చక సేవలో విశేష కృషి చేసి భక్తుల ఆదరణను పొందుతున్నారు. స్వామివారికి నిత్య పూజలు, ప్రత్యేక ఆరాధనలు నిర్వహిస్తూ ఆలయానికి మంచి పేరు తీసుకొచ్చారు.ప్రసాదాచార్యుల తాత ప్రతాపురం వెంకటాచార్యులు వరంగల్ జిల్లా ములుగు మండలం నర్సాపురం నుండి అన్నపురెడ్డిపల్లి గ్రామానికి వచ్చి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కుమారుడు గోపాలాచార్యులు 1980సంవత్సరంలో ఉప అర్చకులుగా నియమితులై ఆలయ సేవలను కొనసాగించారు.కుటుంబానికి చెందిన శ్రీనివాసాచార్యులు, రత్నాచార్యులు, రామానుజాచార్యులు, రంగాచార్యులు కూడా ఆలయ సేవలో పాల్గొన్నారు. ఈ విధంగా ఈ కుటుంబం తరతరాలుగా స్వామివారి సేవలో కొనసాగుతోంది.ప్రసాదాచార్యుల తండ్రి గోపాలాచార్యులు 2012 సంవత్సరంలో మరణించారు. అనంతరం కుటుంబ బాధ్యతలను స్వీకరించిన ప్రసాదాచార్యులు ఆలయ సేవలను కొనసాగిస్తున్నారు.ప్రసాదాచార్యులు 2008 మే 5వ తేదీ నుండి ఆలయంలో అర్చకులుగా పనిచేస్తున్నారు. 2014 సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాలతో ప్రధాన అర్చకులుగా నియమితులయ్యారు. అప్పటి నుండి స్వామివారి సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.ప్రసాదాచార్యుల విద్యాభ్యాసం అన్నపురెడ్డిపల్లి గ్రామంలోనే మొదటి తరగతి నుండి పదో తరగతి వరకు పూర్తయింది. అనంతరం ఓపెన్ విధానంలో విద్యను కొనసాగించారు. తండ్రి మరణంతో కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకొని ఆలయ సేవలో నిబద్ధతతో పనిచేస్తున్నారు.ఆలయంలో నిత్య పూజలు, ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ భక్తుల ఆదరణ పొందుతున్నారు. ఆయనకు ఉత్తమ అర్చకుల అవార్డు రావడం గ్రామ ప్రజలకు గర్వకారణంగా మారింది.ఈ అవార్డు రావడంతో ప్రసాదాచార్యుల కుటుంబ సభ్యులు, బంధువులు మరియు వంశస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ సేవలో తరతరాలుగా కొనసాగుతున్న తమ కుటుంబానికి ఇది గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ప్రసాదాచార్యుల సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధన కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి

- మండల స్థాయి ఎఫ్ ఎల్ ఎన్ బాలమేళా

**పాల్వంచ మార్చి 5, ప్రజాజ్యోతి:** విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధన కోసం ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని పాల్వంచ మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీరామ్ మూర్తి కోరారు పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ బాలమేళా కార్యక్రమం ను ఆయన ప్రారంభించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలో అలాగే కాంప్లెక్స్ వారీగా ఎఫ్ ఎల్ సామర్థ్యాలపై బాలమేళా నిర్వహించి అక్కడ ఎంపికైన విద్యార్థులను మండల స్థాయి పాల్వంచలో గురువారం జరిగిన కార్యక్రమానికి మండల వ్యాప్తంగా 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఎఫ్ ఎల్ ఎన్ సామర్థ్యాలపై ఐదుగురిని అలాగే లైబ్రరీ పై స్టోరీ టెల్లింగ్ ద్వారా ఐదుగురిని ఎంపిక చేసి వారికి పాల్వంచ తాసిల్దార్ ధారా ప్రసాద్ ఎంఈఓ శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు బహుమతులను అందజేశారు. మండల స్థాయిలో ఎంపికైన పదిమంది విద్యార్థులను ఈనెల 9వ తేదీన జిల్లాలో జరిగే ఎఫ్ ఎల్ ఎన్ బాలమేళాకు పంపించమన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ, తాసిల్దార్ మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు కు ప్రాథమిక స్థాయిలో కనీస సామర్థ్యాలైన చదవడం రాయడం చతుర్విధ ప్రక్రియలు గణితం ఇంగ్లీషు తదితర అంశాలపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే కనీస సామర్థ్యాలు విద్యార్థులు సాధించినట్లయితే పై తరగతికి పోయేసరికి వారిలో మరింత చదువులో సామర్థ్యం మరింత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్ రెడ్డి, డిఆర్పిలు రాజశేఖర్, తుక్కాని శ్రీనివాసరెడ్డి ,శోభన్, మంజు శ్రీ, గీత తదితరులు పాల్గొన్నారు.



# డోలు చప్పుళ్లు... శివసత్తుల పూనకాలు

- ఘనంగా ప్రారంభమైన పగిడిద్దరాజు జాతర

**గుండాల, మార్చి 5 (ప్రజాజ్యోతి):** డోలు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ భక్తుల నృత్యాలతో గుండాల మండలంలో పగిడిద్దరాజు జాతర ఘనంగా ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం పగిడిద్దరాజు గద్దెపై కొలువుదీరగా, గురువారం వనదేవత సమ్మక్క తల్లి రాకతో జాతరకు మరింత ఉత్సాహం చేకూరింది.గుండాల మండలం వేపలగడ్డ గ్రామ సమీపంలోని గద్దెల వద్ద జాతర వైభవంగా కొనసాగుతోంది. సమ్మక్క తల్లి భర్తగా భావించే పగిడిద్దరాజు వంశీయులు గత అనేక సంవత్సరాలుగా వేపలగడ్డ గ్రామంలో ఈ జాతరను నిర్వహిస్తూ వస్తున్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర అనంతరం తిరుగు పండుగగా పగిడిద్దరాజు జాతర నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.మేడారం జాతరకు వేపలగడ్డ గ్రామం నుంచి పగిడిద్దరాజు బయలుదేరి వెళ్లిన తర్వాతే జాతర ప్రారంభమవుతుందని స్థానికులు చెబుతున్నారు. మేడారం జాతర ముగిసిన అనంతరం





గిరిజనులు తమ సాంప్రదాయ పద్ధతుల్లో పగిడిద్దరాజు జాతరను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు.ఈ సందర్భంగా పూజారులు, వడ్డెలు సాంప్రదాయ పద్ధతుల్లో పగిడిద్దరాజును గద్దెపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. గురువారం సమీపంలోని గుట్ట నుంచి వనదేవత సమ్మక్కను శివసత్తుల పూనకాల మధ్య డోలు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి పగిడిద్దరాజుతో ఎదురుకోళ్లు నిర్వహించారు. అనంతరం ఇరువురు దేవతలను పగడాల రూపంలో గద్దెలపై ప్రతిష్ఠించారు.దీంతో భక్తులు తండోపతండాలుగా జాతరకు తరలి వచ్చి పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం రాత్రి మొత్తం ఆ ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేపలగడ్డతో పాటు సమీప గ్రామాల అర్రం వంశీయులు ప్రత్యేక పూజలతో వనదేవతలను స్వాగతించారు. దేవతల ప్రతిరూపాలైన పగడాలను చేతబట్టి గద్దెల చుట్టూ ప్రదక్షిణలు చేసి అనంతరం గద్దెలపై ప్రతిష్ఠించారు.

జాతరకు మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య, మాజీ చైర్మన్ లచ్చు పటేల్ హాజరై దేవతలను దర్శించుకున్నారు. అర్రం వంశీయులు అర్రం అప్పయ్య, లక్ష్మీనరసు, కాంతారావు, భిక్షం, బుచ్చయ్య, పెద్ద కాంతారావు, సత్యం, సందీప్, చిన్న కాంతారావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, రమేష్, వేపలగడ్డ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గుండాల సీఐ తిరుపతి, ఎస్సై సైదా రహూఫ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# చేతిలోనే 'మీ టికెట్'

- స్మార్ట్‌ఫోన్‌లో ఆర్టీసీ డిజిటల్ సేవలు
- ప్రయాణికులకు సౌలభ్యం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , మార్చి 5 (ప్రజాజ్యోతి):** ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా ఆర్టీసీ సంస్థ మరో ముందడుగు వేసింది. ఇకపై బస్సు టికెట్ కోసం కౌంటర్ల వద్ద క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా స్మార్ట్‌ఫోన్ ద్వారానే టికెట్ బుక్ చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల హైదరాబాద్‌లోని సచివాలయంలో ఈ డిజిటల్ సేవలను ప్రారంభించారు. ఈ సేవల ద్వారా బస్సు టికెట్లు, పాసులు వంటి సదుపాయాలను ఆర్టీసీ డిజిటల్ విధానంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. 'మీ టికెట్' యాప్ ద్వారా ప్రయాణికులు తమ ప్రయాణ వివరాలు నమోదు చేసి, కావలసిన రూట్‌ను ఎంపిక చేసుకుని ఆన్‌లైన్‌లోనే చార్జీ చెల్లించి టికెట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించారు.

### ››› బుక్ చేసుకునే విధానం ఇలా...

స్మార్ట్ మొబైల్ ఫోన్‌లోని ప్లే స్టోర్ ద్వారా 'మీ టికెట్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆర్టీసీ సేవలను ఎంపిక చేసుకోవాలి. అనంతరం ప్రయాణ గమ్యస్థానాన్ని నమోదు చేసి అందుబాటులో ఉన్న బస్సును ఎంపిక చేసుకోవాలి. చెల్లింపు పూర్తి చేసిన తర్వాత క్యూఆర్ కోడ్‌తో కూడిన ఈ–టికెట్ లభిస్తుంది. బస్సులో ఎక్కిన తరువాత ఆ క్యూఆర్ కోడ్‌ను సిబ్బందికి చూపిస్తే సరిపోతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ హైదరాబాద్, వరంగల్, కోరుట్ల, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. ఈ ప్రాంతాల ప్రజలు విద్య, వైద్యం మరియు ఇతర అవసరాల నిమిత్తం పెద్ద సంఖ్యలో నగరాలకు ప్రయాణిస్తుంటారు. కొత్త డిజిటల్ విధానంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రయాణికులు సులభంగా బస్సు టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కలగనుంది. డిజిటల్ సేవల ద్వారా పారదర్శకత పెరగడంతో పాటు ప్రయాణికుల సమయం కూడా ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

### ››› ప్రయాణికుల సౌలభ్యం కోసమే...

డిజిటల్ విధానం ద్వారా టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గుతుంది. 'మీ టికెట్' యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవడం ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. దీనివల్ల పారదర్శకత పెరగడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. భవిష్యత్తులో మరిన్ని సేవలను కూడా యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నామని భద్రాచలం డీఎం జంగయ్య తెలిపారు




## బోడు వారపు సంత షురూ..



**టేకులపల్లి,మార్చి05,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బోడు గ్రామంలో గతంలో వారపు సంత నిర్వహించేవారు,కొన్ని అనివార్య కారణాలవల్ల కొన్ని సంవత్సరాలు నిర్వహించకపోవడం వల్ల గ్రామ సర్పంచి పాలకవర్గం కలిసి బోడు వారపు సంతను గురువారం ప్రారంభించారు. పరిసర ప్రాంతాల ప్రజలు గ్రామ సర్పంచ్ కి, పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. బోడు సర్పంచ్ మాట్లాడుతూ ఈ వారపు సంతను చుట్టుపక్కల గ్రామ ప్రజలు స్వాధినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాలలో బోడు గ్రామస్తులు, వార్డు మెంబర్లు, సంత నిర్వాహకులు పాల్గొన్నారు.

## జుమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు శానిటరీ ఫ్యాట్స్ పంపిణీ



**టేకులపల్లి,మార్చి05,ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలం బోడు గ్రామపంచాయతీలోని జడ్పీ హైస్కూల్లో మండల విద్యాశాఖ అధికారి జగన్ ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి చదువుతున్న (47) మంది బాలికలకు గురువారం జుమ్మి ఫౌండేషన్ శానిటరీ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.జుమ్మి ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కమల మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్), మెన్స్ట్రువల్ హైజీన్ గురించి అవగాహన కల్పిస్తూ శానిటరీ ప్యాడ్స్ వినియోగం ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు ఆరోగ్యం, భద్రత పరిశుభ్రతపై మంచి అవగాహన కల్పించారు.జుమ్మి ఫౌండేషన్ భవిష్యత్తులో కూడా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని నిర్వాహకులు తెలిపారు. బోడు ఎస్సై మాట్లాడుతూ మహిళల భద్రతపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఎస్ఐ తెలిపారు.ఇటీవల కాలంలో మహిళలపై వేధింపులు,దాడులు జరుగుతున్న సందర్భంగా మహిళలు దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై చట్టపరమైన చర్యలు,రక్షణ మార్గాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో జుమ్మి టెక్నాలజీస్ ఎండీ శ్యాంలాల్ ప్రాజెక్ట్స్ మేనేజర్ మదన్ మోహన్, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది, డి.లాలు,డి. గౌస్య పాల్గొన్నారు.

## గుండెపోటుతో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మృతి



**టేకుల ప ల్లి, మార్చి0 5 , ప్రజా జ్యోతి:** ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గోనెల విజయలక్ష్మి (78) గుండెపోటుతో గురువారం మృతి చెందారు.ఆమె 2006లో టేకులపల్లి జడ్పిటిసి సభ్యురాలుగా గెలుపొందారు. కాంగ్రెస్,తెలుగు దేశం పార్టీలకు సమానంగా సీట్లు రావడంతో టాస్ ద్వారా అప్పటి ఆంధ్రప్రదేశ్ ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ గా ఎన్నుకోబడ్డారు. 1980నుంచి 1990వరకు కాంగ్రెస్ పార్టీలో ఆమె భర్త గోనెల వెంకటనారాయణ ముఖ్య నాయకుడిగా వ్యవహరించారు.అప్పటి ప్రత్యర్థుల చేతిలో 1991లో ఆయన హత్యకు గురయ్యారు.ఆమె అంత్యక్రియలు టేకులపల్లి మండలం ప్రేగల్లపాడు పంచాయతీలోని తెలగనూరులో నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## ఘనంగా దూలుగొండ జాతర

- సాంప్రదాయ ముత్యాలతో జాతర ప్రారంభం



**గుండాల ప్రజా జ్యోతి మార్చ్ 5.** ఈసం వంశీయుల దేవత ముసలమ్మ తల్లి జాతర రోల్లగడ్డలో ఘనంగా ప్రారంభమైంది గురువారం ఉండాల మండలం రోల్లగడ్డ గ్రామంలో దోలుగొండ ముసలమ్మ తల్లి జాతర వంశీయుల వడ్డెలు పూజారులు భక్తులతో ముసలమ్మ తల్లిని సమీపంలోని గుట్ట నుండి తీసుకు వచ్చి గద్దెపై కొలువు తీర్చారు బుధవారం భక్తులు ఈసం వంశీయులు గుడి మెలుగుట మండ మెలుగుట కార్యక్రమాలు నిర్వహించి గురువారం ఉదయం ముసలమ్మ తల్లిని తప్పు వాయిద్యాలతో అంగరంగ వైభవంగా తీసుకువచ్చి గద్దెపై నిలపడంతో జాతర ఘనంగా ప్రారంభమైంది రోల్లగడ్డలో ఊరేగింపుగా దేవతను తీసుకొని గద్దె పైకి రావడంతో ఆ ప్రాంతమంతా భక్తిశ్రద్ధలతో ఒక్క సారిగా పులకించిపోయింది ఈ సమావేశయులు దేవతను ప్రకటించిన అనంతరం నైవేద్యం నిర్వహించి పూజలు చేసిన తదుపరి భక్తులు భక్తులు చెల్లించడం చేస్తున్నారు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఈ ప్రాంతం జనంతో కుక్కిరిసిపోయింది ఈ కార్యక్రమంలో ఈసం వంశీయులు పాపారావు ఈసం కృష్ణ కన్నయ్య బిక్షం రామ్మూర్తి శేఖర్ మల్లయ్య నారాయణ పాపయ్య ఎర్రయ్య సింగన్న మంగన్న సత్యం పాల్గొన్నారు

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 5 ,ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్‌ను జిల్లా కోర్టు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్ కలెక్టర్ అంకిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

# పాల్వంచ మండలంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అవగాహన సదస్సు





**పాల్వంచ, మార్చి 5, ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాల్వంచ మండలం లోని గ్రామపంచాయతీల సర్పంచులు మరియు కార్యదర్శులకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొగ్గ నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు, చెత్త నిర్వహణ, పంచాయతీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మార్చి 6 నుంచి మార్చి 15, 2026 వరకు చేపట్టే కార్యక్రమాల ద్వారా గ్రామాలను శుభ్రంగా, ఆరోగ్యకరంగా మార్చే దిశగా పంచాయతీలు సమగ్రంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యాచరణలో భాగంగా గ్రామాల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికార యంత్రాంగం కోరింది. ఈ సమావేశంలో ఏ పీ ఎం ఎండి మీరాభి, మండలంలోని గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో అధికారులు మరియు ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని పాల్వంచ మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొగ్గ నారాయణ సూచించారు.

## కేజీబీవీ, యు ఆర్ ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై మూడు దశల పోరాటం

- మార్చి 9న పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు.
- మార్చి 16వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు.
- మార్చి 20 న చలో అసెంబ్లీ
- టి ఎస్ యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి రాజు.



**పాల్వంచ మార్చి 5, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, పాల్వంచ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో మరియు పట్టణ గురుకులాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తాత్సర వైఖరికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఆధ్వర్యంలో దశలవారీ పోరాటం చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయించడం జరిగిందని, కేజీబీవీ యుఆర్ఎస్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి. రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నా వేతనాలు అరకొరగానే ఉన్నాయి. గతంలో చేసిన అనేక పోరాటాల సందర్భంలో సర్వీస్ కండిషన్లకు సంబంధించి అధికారులు ఇచ్చిన హామీలు, అమలు జరపకపోగా గత సంవత్సరం 29 రోజులు సమ్మె చేసిన సమయంలో ఉపముఖ్యమంత్రి గారితో జరిగిన చర్చల సందర్భంగా అంగీకరించిన అంశాలు కూడా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని తెలిపారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోగా పోరాడితే కక్షగట్టి మరింత ఇబ్బందులకు గురి చేయడం తగదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి శ్రమకు తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. ఎస్ఓ లను ప్రిన్సిపల్స్ గా, పిజిసిఆర్టి లను జే ఎల్ గా, సిఆర్టి/పి ఈ టి/సీఆర్పీ లను ఎస్ఏలుగా పరిగణించి కనీస మూల వేతనాన్ని చెల్లించాలని మరియు ఆరోగ్య భద్రత కల్పించడం కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని, కేర్ టేకర్లను నియమించి రాత్రి కాపలా డ్యూటీల నుండి విముక్తి చేయాలనీ డిమాండ్ చేస్తున్నాము. ఈ తదితర సమస్యల పరిష్కారానికి మూడు దశల పోరాటంలో భాగంగా .....మార్చి 9న సోమవారం రోజున పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు. ...మార్చి 16వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు. అప్పటికి ప్రభుత్వ స్పందించకపోతే మార్చి 20 శుక్రవారం రోజున అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభమవుతున్న సందర్భంగా చలో అసెంబ్లీ నిర్వహిస్తామని , ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లోపే సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డ్ లో కనీస వేతనాలకు సరిపడా నిధులకు ప్రతిపాదనలు పంపించాలని కోరుతున్నాం. లేనిచో సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలియజేస్తున్నాము. ఈ సమావేశంలో పాల్వంచ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, జి హరి సింగ్, ఏ విజయభాస్కర్, వీటి ఆర్ మోహన్ రావు , బి మంగీలాల్, ఏం రాజులు, సత్య శ్రీ, సువర్చల, మంజుల, యశోద తదితరులు పాల్గొన్నారు.

## బంజారాల సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ పి.ఓ రాహుల్‌కు వినతిపత్రం సమర్పించిన బంజారా సంఘాల జేఏసీ



**భద్రాచలం, మార్చి 5,ప్రజాజ్యోతి :** బంజారా సమాజానికి సంబంధించిన పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బంజారా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్‌కు వినతిపత్రం సమర్పించారు. గిరిజన హక్కులను పరిరక్షిస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల ఉపాధి అవకాశాలను కాపాడేందుకు జి.ఓ. నెం.3ను పునరుద్ధరించి స్థానిక గిరిజనులతోనే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఏరియా ప్రాంతాల్లో అమల్లో ఉన్న 1/70 చట్టం, పీసా చట్టం, ఎల్‌టిఆర్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజన భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రేగళ్ల క్రాస్ రోడ్డు సమీపంలో "శ్రీ శ్రీ శ్రీ సాతి భవాని" అమ్మవారి ఆలయ నిర్మాణం మరియు జాతర నిర్వహణ కోసం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన సాధు సంత్‌లకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించడంతో పాటు బంజారా సమాజానికి ప్రత్యేకమైన తీజ్ పండుగ నిర్వహణకు ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని కోరారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో హతీరామ్ మఠాన్ని ఏర్పాటు చేయాలని, సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ప్రభుత్వం కేటాయించే నిధులను సాధు సంత్‌ల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాల నిర్వహణకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి మండల కేంద్రంలో సేవాలాల్ మహరాజ్ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించి గిరిజన సమాజానికి సాంస్కృతిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని తెలిపారు.గిరిజన జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు నాలుగు లక్షలకు పైగా బంజారా జనాభా ఉన్నందున వారి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు జిల్లా కేంద్రంలో బంజారా మ్యూజియంను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం మరియు భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో బంజారా గిరిజనుల చరిత్రను ప్రతిబింబించే చారిత్రక చిహ్నాలను నెలకొల్పాలని కోరారు.గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి ట్రైకార్ రుణాలను సకాలంలో మంజూరు చేసి అవసరమైన నిధులను విడుదల చేయాలని, గిరిజన యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక పథకాలు అమలు చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్, గణేష్ మహారాజ్, ప్రధాన కార్యదర్శి కాన్సిరామ్, కేశవ్ నాయక్, భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాయకులు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్‌ను శాలువాతో సత్కరించారు